www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 13 ఏప్రిల్ 2025 5 పశ్చిమ గోదావరి

తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

భీమవరం టౌన్ : తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవులలో క్రీడల వైపు దృష్టి మరల్చితే మంచి శారీరక శ్రమతో పాటు, మంచి ఆలోచనా శక్తి కూడా పెరుగుతుందని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అన్నారు. నెలరోజుల పాటు కళాశాలలో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. శిక్షణ శిబిరంలో భాగంగా బ్యాడ్మింటన్, చదరంగం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ తమ కళాశాలలో మే మొదటి వారం వరకు జరిగే వేసవి శిక్షణ శిబిరంలో బ్యాడ్మింటన్, చదరంగంలో సుమారుగా 50 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. చదరంగం కోచ్‌గా ఎస్.చంద్రశేఖర్, బ్యాడ్మింటన్ కోచ్‌గా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ వర్మ వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ఆర్.మోహన్, జి.సారిక, కోచ్ డాక్టర్ కిరణ్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల

అవస్థలకు అంతే లేదా..!

సర్వేల పేరుతో నరకం

తొమ్మిది నెలల పాలనలో పది వరకూ సర్వేలు

ఎంపిడిఒల ఒత్తిడి తట్టుకోలేకపోతున్న ఉద్యోగులు

రేషలైజేషన్ పేరుతో సచివాలయాల్లో ఉద్యోగుల కుదింపు

మూడు కేటగిరీలుగా సచివాలయాల విభజన, ఉద్యోగుల సంఖ్య

ఎ, బి కేటగిరి సచివాలయాల్లో మహిళా పోలీసుల పోస్టుకు ఎసరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. గత ప్రభుత్వం వాలంటీర్లతో చేయించిన సర్వేలను, పనులను ఇప్పుడు సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ నరకం చూపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వేల టార్గెట్లతో ఎంపిడిఒలు తెస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక సచివాలయాల ఉద్యోగులు పడుతున్న అవస్థలు రోజురోజుకీ వర్ణనాతీతంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో దాదాపు పది వరకూ సర్వేలు చేయించిన పరిస్థితి ఉంది. ఒక సర్వే పూర్తికాకుండా, మరో సర్వే అప్పగిస్తూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తోంది. పదేపదే ఇళ్లకు వెళ్లడంతో ఒకసారి రావొచ్చుగా... అన్నిసార్లు ఎందుకు వస్తున్నారంటూ ఉద్యోగులపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 2019 అక్టోబర్ రెండో తేదీన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రారంభమైంది. రెండు వేల మందికి ఒక సచివాలయం చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలోనూ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీస్, ఎఎన్ఎం, సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ ఇలా 11 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉండేలా ముందుకు సాగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 938 వరకూ గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. దాదాపు 8,468 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. గత ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతోపాటు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. సర్వేలు చేయడం, పింఛన్ల పంపిణీ వంటివి వాలంటీర్లు చేసేవారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వ్యవహారం సచివాలయ ఉద్యోగులు చూసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను తీసేసింది. ఇప్పుడు మొత్తం పనులన్నింటినీ సచివాలయ ఉద్యోగులకే అప్పగిస్తున్నారు. పది నెలల పాలనలో హౌస్‌హోల్డ్ సర్వే, పి-4 సర్వే, ఇకెవైసి, వర్క్ ఫ్రమ్ హోం, నాన్ రెసిడెన్షియల్ ఎపి సర్వే, పిఎసిఎస్ సర్వే, చేతి వృత్తిదారులకు సంబంధించిన సర్వే, మిస్సింగ్ సిటిజెన్ సర్వే, పిల్లల ఆధార్‌కు సంబంధించిన వంటి అనేక సర్వేలు, పనులతో ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడిని పెడుతోంది. ఒకే ఇంటికి పదేపదే సర్వేలకు వెళ్లాల్సి వస్తోంది. దీనిపై జనం నుంచి సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సర్వేలు సకాలంలో పూర్తి చేయకపోతే మెమోలు ఇస్తామని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామంటూ ఎంపిడిఒలు చేసే ఒత్తిడి మరింత తీవ్రస్థాయికి చేరింది. దీంతో తమ పరిస్థితి ఏమిటనే బెంగ సచివాలయ ఉద్యోగులను వెంటాడుతోంది.

రేషన్‌లైజేషన్‌తో మరింత పనిభారం..

మహిళా పోలీసుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఉద్యోగులకు సంబంధించిన రేషనలైజేషనను ప్రారంభించింది. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించింది. 2,500 జనాభాలోపు ఉన్న సచివాలయాలను 'ఎ' కేటగిరీ, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న వాటిని 'బి' కేటగిరీ, 3,500 జనాభా పైన ఉంటే 'సి' కేటగిరీలో పెట్టింది. ఉద్యోగులను రెండు రకాలుగా విభజించింది. మల్టీపర్పస్ ఉద్యోగులుగా పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు ఉన్నారు. టెక్నికల్ ఉద్యోగులుగా వీఆర్వో, ఎఎన్ఎం, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, లైన్‌మెన్‌లు ఉన్నారు. 'ఎ' కేటగిరీలో సచివాలయాలకు కేటాయించిన ఆరుగురు ఉద్యోగుల్లో పంచాయతీ సెక్రటరీ లేక డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్‌తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'బి' కేటగిరీలో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేక మహిళా పోలీస్‌తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'సి' కేటగిరీ సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌తోపాటు మరో నలుగురు టెక్నికల్ ఉద్యోగులు ఉంటారు. 'ఎ', 'బి' కేటగిరీల్లో వెల్ఫేర్ సెక్రటరీ లేకపోతే మహిళా పోలీసులు ఉంటారు. దీంతో ఇప్పుడు ఆయా సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీస్ ఉద్యోగులను ఎక్కడకు పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సరాసరిన ప్రతి మండలంలో 12 నుంచి 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో నాలుగు నుంచి ఐదు వరకూ 3,500కు పైగా జనాభా ఉన్న 'సి' గ్రేడ్ సచివాలయాలుగా ఉన్నాయి. మిగిలిన చోట్ల పని చేస్తున్న మహిళా పోలీసులను ఏం చేస్తారో ప్రభుత్వం ఇంకా చెప్పకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్య కుదించడంతో సర్వేలు, పింఛన్ల పంపిణీ వంటి పనిభారం మరింత పెరగనుంది. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది.

ఇంటర్ ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం

గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు

రాష్ట్రంలో జిల్లా ఫస్టియర్‌లో 11వ స్థానం, సెకండియర్‌లో 10వ స్థానం

సమన్వయంతో మంచి ఫలితాలు సాధించాం : డిఐఇఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించారు. గతేడాదికన్నా ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణతాశాతం పెరిగింది. జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 70 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో మన జిల్లా ఫస్టియర్‌లో 11వ స్థానం, సెకండియర్‌లో 10వ స్థానానికి పరిమితమైంది. జిల్లావ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాల్లో మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు సుమారు 37,930 మంది పరీక్షలు రాశారు. 900 మంది ఇన్విజిలేటర్లతోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది విధులు నిర్వహించారు. సీసీ కెమెరాల నిఘాలో అత్యంత కట్టుదిట్టంగా పరీక్షలు జరిగాయి. పరీక్షలు జరిగిన 23 రోజుల అనంతరం ప్రభుత్వం ఫలితాలను శనివారం ఉదయం 11 గంటలకు విడుదల చేసింది. జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17,257 మంది పరీక్షలకు హాజరవ్వగా 12,046 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,260 మంది పరీక్షలకు హాజరవ్వగా 11,948 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ 5,211 మంది విద్యార్థులు, సెకండియర్ 2,312 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. గతేడాది ఫస్టియర్ విద్యార్థులు 69.4 శాతం, సెకండియర్ విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఫస్టియర్‌లో ఒక శాతం, సెకండియర్‌లో 5 శాతం ఉత్తీర్ణత పెరిగింది. గతంతో పోలిస్తే జిల్లావ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాపక సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయ కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామని డిఐఇఒ నాగేశ్వరరావు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన

డిఇఒ నారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. శనివారం నవాబుపాలెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. రీ జాయినింగ్ అయిన విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యం, పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజనం అమలు, శానిటేషన్, మరుగుదొడ్ల పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ నారాయణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల కృషికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ వి.హనుమ, గ్రామ నాయకులు మద్దుకూరి ధనరాజు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం రుచి చూస్తున్న డిఇఒ నారాయణ

బెల్టుషాపులు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

మద్యం సిండికేట్లు గ్రామాల్లో ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా వాటి నియంత్రణకు ఎక్సైజ్ శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, కూటమి ప్రభుత్వం బెల్టుషాపుల జోలికెళ్లొద్దని ఏమైనా ఆదేశాలిచ్చిందా అని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రశ్నించారు. బెల్టుషాపులు వెంటనే తొలగించాలని, కల్లు అమ్మకాలు దెబ్బతీయొద్దని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వృత్తి చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని గీత కార్మికులు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ ఎస్ఐ రఘుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాకు బొంతు శ్రీను అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి నరసింహమూర్తి మాట్లాడుతూ పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో తాగడానికి స్వచ్ఛమైన తాగునీరివ్వలేని పాలకులు ఊరువాడా మద్యం వరదలా పారించడాన్ని ఖండించారు. సిండికేట్లకు భారీ లాభాల కోసం మద్యం పాలసీకి తూట్లు పొడుస్తారా అని ప్రశ్నించారు. బెల్టు షాపులుంటే బెల్టు తీస్తామని సిఎం చేసిన హెచ్చరికలు ఏమయ్యాయని నిలదీశారు. సిఎం మాటల్లో చిత్తశుద్ధి ఉంటే తక్షణం జిల్లాలోని ఐదు వేలు, రాష్ట్రంలోని 70 వేల మద్యం దుకాణాలను మూయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్కా చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే గీత కార్మికుల బతుకులు మారతాయని, వృత్తిని ఆదుకుంటారని ఆశించామని, దానికి భిన్నమైన విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఆదరణ పథకం ద్వారా ప్రతి గీత కార్మికునికీ మోటర్ సైకిల్ ఇవ్వాలని, ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. బెల్టుషాపులు తొలగించని పక్షంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో జక్కంశెట్టి సత్యనారాయణ, దాడి గురుమూర్తి, శీలం సత్యనారాయణ, బూరాబత్తుల శ్రీను, కడలి సంజీవరావు, గీత కార్మికులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

దమయపర్తి డ్రెయిన్ పనులు పూర్తి చేస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు దుఃఖదాయిని దమయపర్తి డ్రెయిన్ పనులు పూర్తి చేసి పట్టణాన్ని ముంపు బారి నుంచి కాపాడతామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. రూ.14 కోట్లతో దమయపర్తి మురుగు డ్రెయిన్ కాంక్రీట్ గోడ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన కొద్దిపాటి డ్రెయిన్ పనులు, వైసిపి ప్రభుత్వంలో విధ్వంసానికి గురయ్యాయన్నారు. వైసిపి హయాంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కోట్లాది రూపాయలను దారి మళ్లించి పురపాలక సంఘాలను నిర్వీర్యం చేశారని చెప్పారు. జగన్ ప్రభుత్వం పట్టణ ప్రజలపై వేసిన చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. స్వచ్ఛభారత్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు, గత వైసిపి ప్రభుత్వం కనీసం రాష్ట్ర వాటా కూడా చెల్లించకపోవడంతోనే చెత్త పేరుకుపోయి, అనారోగ్యప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

దమయపర్తి డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పీడిత ప్రజల విముక్తికి బసవపున్నయ్య కృషి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాసుదేవరావు

భీమవరం : పీడిత ప్రజల విముక్తికి తుది శ్వాస విడిచేంత వరకూ నిరంతరం కృషిచేసిన వ్యక్తి మాకినేని బసవ పున్నయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అన్నారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనం వద్ద మార్క్సిస్టు మేధావి, సిపిఎం నవరత్నాల్లో ఒకరైన మాకినేని బసవపున్నయ్య 33వ వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పీడిత ప్రజలకు అండగా నిలిచి వీరోచిత పోరాట యోధుడిగా నిలిచారన్నారు. అంతర్జాతీయంగా కమ్యూనిస్టు పార్టీలో ఒడిదుడుకులు వచ్చినప్పుడు, భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో మాకినేని అందరి మన్ననలు పొందారన్నారు. ప్రస్తుతం అమెరికాలో ట్రంప్, కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించడమే బసవ పున్నయ్యకు నిజమైన నివాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, జీ.రఫైలు, డి.త్రిమూర్తులు, వడుగు వెంకటేశ్వరరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బొర్రా అల మహారాజు, రత్నకుమారి, నీలాపు రాజు, నాగరాజు, లత, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాసుదేవరావు

గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పోడూరు

రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న గ్రామసేవకుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ నిబంధాలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వెంటనే ఆపాలన్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఇస్తున్నట్లు నామినీలతో సహా విఆర్ఎలందరికీ పే స్కెలు జీతాలు ఇవ్వాలన్నారు. డిఎను జీతంలో కాలపాలన్నారు. వైసిపి పాలనలో రికవరీ చేసిన డిఎ నగదును తిరిగి చెల్లించాలన్నారు. విఆర్‌లకు ప్రమోషన్ అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ డ్రైవర్ ఖాళీ పోస్టులు అర్హులైన విఆర్ఎతో భర్తీ చేయాలన్నారు. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బెల్లాని ప్రకాశరావు, సిఐటియు నాయకులు బురాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, ఎన్.మోహన్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ రమణారావుకు కిన్నెర ఉగాది పురస్కారం

తాడేపల్లిగూడెం: నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు కిన్నెర శ్రీవిశ్వావసు నామ ఉగాది పురస్కారాన్ని ఇటీవల అందుకున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు ఈ ఏడాదికిగాను సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న రమణారావును ఎంపిక చేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతులమీదుగా రమణారావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు గ్రహీత రమణారావుకు ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తీక్, పలువురు విభాగాధిపతులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

గుబులు.. దిగులు..!

ఓపక్క ఎండల తీవ్రత పెరిగింది. దానికితోడు అధిక వేడి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ క్రమంలోనే పాలకుల విధానాలు వాతావరణ వేడిని మించి జనంలో గుబులు రేపుతున్నాయి. ఓపక్క అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుందుడుకు విధానాలతో జిల్లాలోని ఆక్వా రంగంపై పిడుగుపడినట్లయ్యింది. ఇక మేమేమీ తీసిపోలేదన్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధర రూ.50 పెంచుతూ వంటింట్లో మంట పెట్టింది.

పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో వాతావరణ మార్పులు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఈ వేసవిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మే నెల ఎండలను తలపించేలా మార్చి నెలలోనే సూరీడు సుర్రుమన్పిం చాడు. ప్రస్తుతం ఎండలు, దానికి తోడు అధిక వేడి జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఓపక్కన పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ నమోదవుతున్నాయి. ఉక్కబోతతో జనం విలవిల్లాడుతున్నారు. అదే సమయంలో సాయంత్రం వేళల్లో వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుని గాలి, వాన బీభత్సం సృష్టిస్తున్నాయి. వాతావరణం చల్లబడిందని ఆనంది ంచేలోపు గాలి దుమారం వల్ల పంట, ఆస్తి నష్టం సంభవి స్తుండ టంతో ఇదేమి వాతావరణమో అని జనం తలలు పట్టుకుంటున్నారు.

ఇక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం మన జిల్లాలోని ఆక్వా ఉత్తత్తులపై పడింది. ట్రంప్ ప్రకటన వెలువడగానే ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిదారులు రొయ్య ధర తగ్గించేశారు. ఒక్కో కౌంట్‌కు రూ.20 నుంచి రూ.40 వరకూ తగ్గించేయడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వం జోక్యం చేసుకున్నా పెట్టుబడులు రావాలంటే నిర్ణయించాల్సిన ధర కంటే రూ.20 తక్కువే ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు నష్టపోక తప్పని పరిస్థితి. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ఏదైనా ఆందోళన చేసినప్పుడు అమెరికా వాడి గురించి మనకెందుకు అంటూ వామపక్షవాదులతో వాదించిన పలువురు ఇప్పుడు అమెరికా తీరును ఖండిస్తూ ఆక్వా సమస్యలు పరిష్కారం కావాలంటే సిపిఎం రంగంలోకి దిగి పోరాడాల్సిందేనని అం టుండటం గమనార్హం. ఇక అదే సందర్భంలో రొయ్య



రైతులు క్రాప్ హాలిడేకు సిద్ధం కావడం చర్చనీయాంశమైంది. వాస్తవానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలకు ముందే ఫీడ్, సీడ్ ధరలు విపరీతంగా పెంచేశారని, ముడిసరుకుల ధరలు దిగొచ్చినా ఫీడ్ ధరలు ఎందుకు తగ్గించడం లేదని ఆక్వా రైతులు ప్రశ్నిస్తున్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు కూడా. ఆ సమస్య పరిష్కారం కాకముందే గోరుచుట్టుపై రోకలిపోటులా ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం ఆక్వా రైతులపై పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అటు అమెరికా సుంకాలు, ఇటు ఫీడ్, సీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోకపోతే రొయ్య రైతులు క్రాప్‌హాలిడే పాటించడం తథ్యమని స్పష్టమవుతోంది. మరి ప్రభుత్వం స్పందించి రొయ్య రైతుల్లో నెలకొన్న గుబులు, దిగులును పోగొట్టేలా చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

ఎక్కడో ఉన్న అమెరికా పాలకులకు తామేమీ తీసిపోమన్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గృహావసరాల గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం గమనార్హం. దీంతో ప్రతియేటా జిల్లాలో గ్యాస్ వినియోగదారులపై కనీసంగా రూ.32 కోట్లు భారం పడుతోంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక కరెంటు ఛార్జీల గురించి చెప్పుకోనవసరం లేదు. ఈ క్రమంలో గ్యాస్ ధర పెంపుపై మహిళల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క పెట్రోలు, డీజిల్ ధరలపై కేంద్రం రూ.2 ఎక్సైజ్ సుంకం పెంచింది. ఇది వినియోగ దారులపై పడదు, ఆయిల్ కంపెనీలే భరిస్తాయని చెప్పడం జనాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంత వంచిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే కేంద్రం ఆ ఎక్సైజ్ సుంకం పెంచకపోతే ఆయిల్ కంపె నీలు లీటర్‌కు రూ.2 చొప్పున పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిం చాలి. అయితే దానికి భిన్నంగా ప్రజలు లబ్ధి పొందకుండా కేంద్రం తన ఆదాయాన్ని పెంచుకోవడం అంటే ఆ రూ.2 భారాన్ని ప్రజలపై మోపిన ట్లేనని పేద, మధ్యతరగతి ప్రజలు వ్యాఖ్యాని స్తున్నారు. మొత్తంగా వాతావరణంతోపాటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధర పెంపు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావంతో జిల్లావాసుల్లో గుబులు, దిగులు నెలకొందని చెప్పక తప్పదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

నిండా ముంచిన అకాల వర్షం

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా సీసలి, కాళ్ల గ్రామాల్లో 200 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఆ ఆయకట్టు పరిధిలోని వరి పంట గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా ముంపునకు గురైంది. దీంతో పొలాల్లోంచి ఆ నీటిని బయటకు తోడేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. కోత దశలో ఉన్న వరి పంట నీట మునగడంతో దిగుబడులు తగ్గడంతోపాటు ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఫలితంగా ధర తగ్గించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



సీసలిలో వరి చేలో ఉన్న నీటిని బయటకు తోడుతున్న ఆయిల్ ఇంజన్

నష్ట పరిహారం చెల్లించాలి

తోట శ్రీనివాసరావు, కౌలు రైతు, సీసలి



32 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నా. ఇప్పటివరకు ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టాం. వర్షం వల్ల ముంపు నీటిని తోడేందుకు ఎకరానికి మరో రూ.వెయ్యి అదనంగా ఖర్చయ్యింది. పంట కోసినా దిగుబడి తగ్గిపోతుంది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం భీమవరం ప్రకాశం చౌక్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం దేశ ఐక్యతకు, రాజ్యాంగంలో మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతమని, ప్రతిపక్షాలు సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకోకుండా వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని అర్ధరాత్రి సమయంలో మోడీ ప్రభుత్వం ఆమోదించడం దారుణమన్నారు. ముస్లిం మైనారిటీల నాయకులు ఖాన్ భాషా, షేక్ ఆషా, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, కార్యదర్శి వి.రాజు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి, నాగిడి శాంతమూర్తి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, చిత్తరంజన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకురాలు అల్లం మాణిక్యం మృతి

మాణిక్యం(ఫైల్)

ఆచంట : వేమవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ మహిళా సంఘం నాయకురాలు అల్లం నాగ మాణిక్యం(92) అలియాస్ (నాగమ్మ) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈమెకు అల్లం నాగ మల్లయ్య, అల్లం సోమ చంద్రరావు ఇద్దరు కుమారులు కలరు. ఈమె 1975 నుంచి 2025 సుమారు ఐదు దశాబ్దాలుగా సిపిఎం సభ్యురాలుగా కొనసాగారు. ఈ సందర్భంగా నాగమ్మ పార్థీవ దేహంపై సిపిఎం శాఖ కార్యదర్శి గుత్తుల రంగారావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి పి.మోహన్ రావు పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆమె మృతదేహానికి శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎర్రజెండాలతో ర్యాలీగా ఆమె అంత్యక్రియలలో పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, సిర్రా విగ్నేశ్వరుడు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, రాపాక సత్యనారాయణ, ఎజెఎస్.సత్యనారాయణ, తదితర కుటుంబ సభ్యులు పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి జెవిఎస్.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేత గోపాలన్, సిపిఎం మాజీ ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పెదఅమిరంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో...

పెదఅమిరం గ్రామంలో శ్రీరామకృష్ణ షీపుడ్ కె.స్వామినాయుడు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. పెదఅమిరం గ్రామానికి చెందిన కె.స్వామి నాయుడు చేస్తున్న ఈ సేవా కార్యక్రమానికి ఆయన భార్య సాయి, కుమారుడు శ్రీహర్ష, కుమార్తె ఇంద్రాణి సహకరిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామి నాయుడు సతీమణి సాయి చేతుల మీదుగా బాటసారులకు, ప్రయాణికులకు, వాహనదారులకు మజ్జిగను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు గత ఐదు సంవత్సరాలుగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ చలివేంద్రాన్ని ప్రయాణికులు, గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో దాహార్తి తీర్చేవి చలివేంద్రాలు : ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలేనని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం అడ్డ వంతెన దగ్గర అల్లూరి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు చలివేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పిపిటి బ్రదర్స్, అల్లూరి యువజన సంఘం అధ్యక్షులు అద్దేపల్లి సుబ్బరాజు, స్వామి సుబ్బరాజు, దండు అరవింద్ రాజు, కోపల్లె పృథ్వీరాజు, కోపల్లె సతీష్ రాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రధాన చెర్వు పక్కన ఉన్న శ్రీకనక దుర్గమ్మ జాతర మహోత్సవం సందర్భంగా శనివారం సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య స్మారక స్థూపం వద్ద వేసవి చలివేంద్రం ఏర్పాటు చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, మండల కమిటీ సభ్యులు కె.సుబ్బరాజు, శాఖ సభ్యులు వి.కాంతారావు, ఎం.సూర్యనారాయణ, ప్రభుదాసు, జె.రామాంజనేయులు, వెంకట్రావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'పోషణ్ పక్వాడ'

మొగల్తూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్.సుధాకర్ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాళీపట్నంలో ఉన్న హెచ్‌ఎం పేటలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీ టీచర్ ఎస్.సారమ్మ, ఎఎన్‌ఎం నీరజ, జివి.వెంకటేశ్వర్లు, ఎఎన్‌ఎస్.లక్ష్మి, మాధవి ఉన్నారు.

యలమంచిలిలో...

యలమంచిలి : మండలంలోని పెదలంక గ్రామ అంగన్వాడీ సెంటర్లో శనివారం పోషకాహార పక్షోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ఎస్.మల్లేశ్వరి హాజరై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీలు ఎస్.కనకదుర్గ, వి.వెంకటరమణ, ఆశాలు సీమంతకార్యక్రమాలు జె.సుజాత, ఎస్.అనసూయ పాల్గొన్నారు.

భీమవరం : పిల్లలకు చిన్నప్పటి నుంచి అందించే ఆహారంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం అన్నారు. శనివారం గొల్లవానితిప్ప సెక్టార్ పరిధిలోని రాయలం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్ సిహెచ్.మహాలక్ష్మి, తాయారు, హెల్పర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

భీమవరం టౌన్ : బదుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిఆర్.అంబేద్కర్ అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

భీమవరం టౌన్ : గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు కూడా స్వచ్ఛమైన నీరు అందిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని గుట్టపాడు గ్రామ శివారు పాత పూసలమర్రులో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. భీమవరం-దొంగపిండి, భీమవరం-లోసరి, నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప వరకు శాశ్వత పరిష్కారం చూపుతామని, ఏ గ్రామాల్లోనూ మంచినీటి సమస్యలు లేకుండా చేస్తామని, దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బెనహర్

కాళ్ల : జువ్వలపాలెం గ్రామానికి చెందిన గుర్రం జార్జి బెనహర్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం మండల కోఆప్షన్ సభ్యులుగా, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామీద ఎంతో నమ్మకంతో రెండవ సారి క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర కమిటీలోకి నియమించిన వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిఎల్.నరసింహ రాజు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, వైసిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఆచంట : ఆచంటలో తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో మంచినీటి చెరువు గట్టున నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు మాసంపల్లి జెఎసి నాయకులు బీరా మధు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఆవిష్కరణలో ప్రముఖులు ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, ఆర్‌డిఓ దాసిరాజు, మాల సంఘాల జెఎసి రాష్ట్ర నాయకులు చీకటిమిల్లి మంగరాజు, గుమ్మాపు సూర్య వరప్రసాద్, నల్లి రాజేష్, బండి సుందర రామమూర్తి, జిల్లెల్ల సత్య సుధమా, జెల్లెడ్డి మునిబాబు, చవటం రవిచంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

స్టాక్ పాయింట్‌పై అవగాహన

పెనుగొండ : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర-1 స్టూడెంట్ కిట్ల భద్రతపై శనివారం ఆచంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల స్థాయి స్టాక్ పాయింట్‌గా ఆచంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు పరిశీలకులు డాక్టర్ టివిఎస్ ఇస్మాయిల్ అన్నారు. శనివారం ఆయా మండలంలోని పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్లను జిల్లా అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్ల పరిశీలన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిఓఇ వై.చంద్రశేఖర్, ఎంఇఒ-2, పి.రాజేంద్రప్రసాద్, సిఆర్పిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆదిత్య విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

నరసాపురం : ఇంటర్ పరీక్షా ఫలితాలలో నరసాపురం ఆదిత్య విద్యార్థులు ఎంపిసి, బైపిసి గ్రూపులలో టౌన్ ఫస్ట్ సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను మోళా సూర్యనిఖిల్ 986 మార్కులు, బొడ్డు త్రివేణి 985, మేడిది వెంకట సుజిత 985, ఉప్పులూరి శ్రావణి 980, మండపాటి పృథ్వీనటరాజ్ 980 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను గెడ్డం ఎలిజబెత్‌మ్యూల్ 987, వేంద్ర సృజన 988, ముస్సి భవానీదుర్గ 984, పితాని డింపుల్ 984 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను చిక్కాల బాలాజీ 464, అడ్డాల అమృతశ్రీ 464, కరెళ్ల హారిక 463, అంద్రాజు అనిల్ కుమార్ 463, గన్నాబత్తుల లక్ష్మీ సత్య కళ్యాణ్ 463, పెదపల్లి పన్విత వరశ్రీ 462, విస్సా రుతిక దేవిశ్రీ 461, రావూరి భవాని సుబ్రహ్మణ్యం శ్రీనివాస్ 461 మార్కులు సాధించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను తమ్మిశెట్టి సాహితి 435, పాలింకి రమ్య శ్రీలక్ష్మీ 431, తిరుమాని పావని స్వరూపిని 430 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారికి ఉత్తమ శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.దీపక్ రెడ్డి, డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.శివకోటప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ దుర్గాభవాని అభినందించారు.

శ్రీగౌతమి విద్యా సంస్థల విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ దుర్గాప్రసాద్

శ్రీ గౌతమి విద్యార్థులు టౌన్ ఫస్ట్ ర్యాంకులు సాధించినట్లు శ్రీగౌతమి విద్యా సంస్థల ఛైర్మన్ చినమిల్లి దుర్గా ప్రసాద్ తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు 466ను తరపట్ల చైతన్య సాధించి టౌన్ ఫస్ట్ వచ్చింది. 463 మార్కులు ఇద్దరు స్టూడెంట్స్ ఎన్.విషిత, ఎన్.భావన సాధించినట్లు ఆయన తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో బొడ్డు గోపిక 1000 మార్కులకు 984 మార్కులు సాధించి కాలేజ్ ఫస్ట్ ర్యాంక్, బైపిసిలో ఎండీ ఫరిహా 1000 మార్కులకు 969 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఛైర్మన్ దుర్గా ప్రసాద్ అభినందించారు.

శ్రీవాసవి జిఎమ్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థుల విజయదుందుభి

తాడేపల్లిగూడెం : ఇంటర్ ఫలితాల్లో శ్రీవాసవి జూనియర్ కాలేజీ విద్యార్థులు సిఇసి విభాగంలో జి.షర్మీలా దీప్తి 485/500 మార్కులతో టౌన్ సెకండ్ ర్యాంక్, ఇంటర్ సీనియర్ ఎంఇసి విభాగంలో డి.మణికంఠ రెడ్డి 950/1000 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. జూనియర్ బైపిసిలో బి.ప్రశాంతి 425/440, సీనియర్ బైపిసి విభాగంలో ఆర్.జ్ఞానప్రసూనాంబ 952/1000, సీనియర్ ఎంపిసి విభాగంలో కె.అభి 933/1000 మార్కులతో అద్వితీయ ప్రతిభతో పాటు, కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో 90 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిని కళాశాల ఛైర్మన్ లయన్ గ్రంధి సత్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ సిఎవివిఎన్.లక్ష్మీ నారాయణ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ విఎస్ఎన్.శ్రీనివాస్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

జ్ఞానానంద విద్యార్థుల ప్రతిభ

ఫస్ట్ ర్యాంకర్ బ్లెస్సీ

కాళ్ల : ఇంటర్ ఫలితాల్లో ఏలూరుపాడు జ్ఞానానంద జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ ఎం.త్రిమూర్తిరాజు శనివారం వెల్లడించారు. ఇంటర్మీడియట్ రెండో ఏడాది విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీనియర్ బైపిసి విద్యార్థిని ఎస్.బ్లెస్సీ 957, ఎంపిసిలో ఎ.దుర్గా గణేష్ 891, సిఇసిలో జె.శ్రీలక్ష్మి 871 మార్కులు సాధించి కాలేజీ టాపర్లుగా నిలిచారని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డిజెఎస్ఆర్.శ్రీనివాస వర్మ, అకాడమిక్ డైరెక్టర్ డి.విజయ కుమారి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సీనియర్ ఇంటర్‌లో యుకె కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఫస్ట్ ర్యాంకర్ కామాక్షి

పెనుమంట్ర : సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో మండలంలోని గరువు గ్రామానికి చెందిన ఆంధ్రా అసోసియేషన్(యుకె) జూనియర్ కాలేజీ విద్యార్థులు ఘనత సాధించారు. సీనియర్ ఇంటర్లో 90 శాతం, జూనియర్ ఇంటర్లో 62 శాతం విద్యార్థులు మంచి ఫలితాలు తెచ్చారని కాలేజీ పాలకవర్గ ప్రెసిడెంట్ డాక్టర్ తేతల గుర్రెడ్డి, కార్యదర్శి, కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, ప్రిన్సిపల్ అబ్బినేని సత్యప్రకాష్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఇంగ్లీష్ మీడియం ఎంపిసిలో ప్రథమ స్థానం వెలివెల నాగ శ్రీలక్ష్మీ, కామాక్షి 988/1000 మార్కులతో కాలేజీ ఆల్ టైమ్ రికార్డ్ సాధించారు. కాగా ద్వితీయ స్థానం గోవిందరాజు, హరిత 983/1000 పొందారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో కొనకళ్ల కుసుమ 454/470 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా పొన్నపల్లి జ్యోతి శ్రీవల్లి 448/470 మార్కులతో ద్వితీయ స్థానం పొందింది. మార్టేరు పూర్ణోదయ జూనియర్ కళాశాలలో ప్రథమ ఇంటర్ ఎంపిసి ఇంగ్లీష్ మీడియం పంతులు కావ్య 470కు 450 మార్కులు సాధించింది. ఇంటర్ ప్రథమ సిఇసిలో ఎం.బిందు మాధవి 416 మార్కులు పొందింది. ఈ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 80 శాతం మంది పాసయ్యారు. మండలంలోని జిల్లా పరిషత్‌లో ఐదుగురు ప్రథమ ఇంటర్ పరీక్షలు రాయగా ఇద్దరు పాస్ అయ్యారు. ఎం.వెంకట లక్ష్మి 342 మార్కులు సాధించడం విశేషం.

ఉండి హైస్కూల్ విద్యార్థికి మండల ప్రథమ స్థానం

ఫస్ట్ ర్యాంకర్ శైలజ

ఉండి: జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాలలో ఉండి హై స్కూల్‌కు చెందిన ఎ.శైలజ 452 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ వై.రామలక్ష్మి తెలిపారు. మండలంలోని దివ్య జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం 72 మంది విద్యార్థులకు 61 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 68 మంది విద్యార్థులకు 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. జూనియర్ ఇంటర్‌లో 400 మార్కుల పైబడి ఏడుగురు విద్యార్థులకు వచ్చాయని, సీనియర్ ఇంటర్‌లో 800పైబడి మార్కులు ఆరుగురు విద్యార్థులకు వచ్చాయని కళాశాల డైరెక్టర్ కె.దుర్గారావు తెలిపారు. యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని, రెండో సంవత్సరం 56 మంది విద్యార్థులకు 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఎల్.చార్మి ఒకేషనల్ కోర్సులో 957 మార్కులు సాధించిందని, సిఇసి విభాగంలో జి.మంగమ్మ 463 మార్కులు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రమా ప్రియ తెలిపారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ ఇంటర్‌లో 8 మంది విద్యార్థులకు ఐదుగురు, సీనియర్ ఇంటర్లో నలుగురు విద్యార్థినిలకు నలుగురు ఉత్తీర్ణులయ్యారని జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 452 మార్కులతో ఎ.శైలజ మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని, గత ఏడాది ఉండి హై స్కూల్‌లోనే చదివిన శైలజ టెన్త్ క్లాస్ 558 మార్కులు సాధించినట్లు రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శైలజను అభినందిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై.రామలక్ష్మి తెలిపారు.

పాలకోడేరులో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణత

పాలకోడేరు : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 37 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కాగా శనివారం ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాలకోడేరు హైస్కూల్ ప్లస్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం మహేష్‌బాబు తెలిపారు. శృంగవృక్షం హైస్కూల్ ప్లస్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం కాశీ విశ్వనాథం తెలిపారు. పాలకోడేరు సహకార సంఘం కళాశాలకు చెందిన విద్యార్థులు 15 మంది పరీక్షలు రాయగా 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రికార్డు నెలకొల్పారు.

ఎస్‌కెఎస్‌డి జూనియర్ మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ

తణుకు : ఎస్‌కెఎస్‌డి జూనియర్ మహిళా కళాశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలను సాధించారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల్లో కె.ప్రియాంక 425(బైపిసి ఇంగ్లీషు మీడియం), కె.అక్షణ 435(ఎంపిసి ఇంగ్లీషు మీడియం), కె శ్రీగోపికచార్మి 415(ఎంఇసి ఇంగ్లీషు మీడియం), కె.రమతేజస్విని సుహాసిని 459(సిఇసి ఇంగ్లీషు మీడియం), ఎం.లక్ష్మీదుర్గ 427(సిఇసి తెలుగు మీడియం), ఎం.నిస్సి 428(హెచ్ఇసి తెలుగు మీడియం) మార్కులు సాధించగా, ఒకేషనల్ కోర్సుల్లో బి.లక్ష్మీరాఘవ 492(1సిఎస్ఇ), జె.బ్యూలా 472(ఎ,టి) ఎల్.సుష్మ 450(1ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్)) మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుల్లో బి.దీప్తిరాణి 980(ఎంపిసి ఇంగ్లీషు మీడియం), సిహెచ్.అనూష 962(బైపిసి ఇంగ్లీషు మీడియం), బి.అక్షయ సుధ 934(సిఇసి ఇంగ్లీషు మీడియం), పి.ఉషాబారాణి 916(హెచ్ఇసి తెలుగు మీడియం) మార్కులను సాధించగా ఒకేషనల్ కోర్సులలో పి.సువర్ణ 974(సిఎస్ఇ) పి.నీలిమ 970(ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్)), ఎస్.యమున 951(ఎ,టి) మార్కులు సాధించారు.

మంటిస్సోరి జూనియర్ కాలేజీ విజయ దుందుభి

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బైపిసి విభాగంలో ఎ.లావణ్య 435/440 మార్కులతో, ఎంపిసి విభాగం పిఎస్‌వి.సూర్యనారాయణ 464/470 మార్కులతో, టి.హరి నాగేంద్రనాథ్ 464/470, ఎం.అజన్యనిస్సి 463/470, జె.వైష్ణవీప్రణీత 463/470, ఎస్.హేమంత్ నాగపవన్ 461/470 మార్కులతో విజయకేతనం ఎగురవేశారు. డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జ్ఞానమంజరి, అకడమిక్ డైరెక్టర్ పువ్వాడ కిషోర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జ్యోతి, తేజశ్రీ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిసి సీనియర్ విభాగంలో కె.జ్యోతి 951, సెకండ్ ఇయర్ బైపిసి విభాగంలో జె.తేజశ్రీ 890 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ నాగవేణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో వి.ప్రకాష్ 554, బైపిసిలో జె.నివేదిత 407, సిఇసిలో మహమ్మద్ అలియానూర్ 447, హెచ్ఇసిలో బి.యశోదకృష్ణ 384, ఎంఎల్‌టిలో ఎ.శ్రీరామలక్ష్మి 469 మార్కులతో టాపర్‌గా నిలిచారన్నారు. ఇంటర్ సెకండియర్ బైపిసిలో జె.తేజస్వి 890, సిఇసిలో జి.ప్రవల్లిక 85, హెచ్ఎస్ఇసి.శ్రీలత 847 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ నాగవేణి తెలిపారు.

ఆదిత్య జూనియర్ కాలేజీ విద్యార్థుల విజయకేతనం

ఫస్ట్ ర్యాంకర్ షేక్ కుబ్రా యాస్మిన్

మార్చి 2025లో జరిగిన ఇంటర్ పరీక్షా ఫలితాలలో స్థానిక ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు టౌన్ ఫస్ట్ ర్యాంక్‌తో విజయకేతనం ఎగురవేసారని కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపిసి విభాగంలో షేక్ కుబ్రా యాస్మిన్ 991, చాందిని లక్ష్మి 990, హిందూ మాధురి 989, లీలా లోహిత 989, బైపిసి విభాగంలో యామిని ప్రియ 989, జి.జ్యోతిశ్రీ 987, మోహియా నాగనందిని 985, సీసీ విభాగంలో ఎఎల్‌వి.రమణ 951, జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపిసి విభాగంలో ఎం.లక్ష్మీ ప్రసన్న 465/470, ఎ.జరూష 464, కె.మౌనిక 464, కె.హేమశ్రీ 464, ఏలూరి కీర్తి 464, డి.నాగరాజు 464, బైపిసి విభాగంలో అడపా నవ్యశ్రీ 433/440, పి.హాసిని రామప్రియ 433, ఎ.దనుష 432, బి.జాహ్నవి 432, జి.హారిక 431, ఎమ్.హేమ వర్షిని 431, సిఇసి విభాగంలో జి.నాగమ నోజన 487/500 మార్కులు సాధించారని తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో మహిళలదే పై చేయి

మహాలక్ష్మి, సౌమ్య

ఆచంట : మండలంలోని వల్లూరు ఎంపీ పాలెం ఇంటర్మీడియట్ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 461 మార్కులతో ఉండవల్లి సౌమ్య ప్రథమ స్థానం నిలవగా ఇంటర్మీడియట్ సెకండియర్‌లో 1000 మార్కులకు గాను 886 మార్కులతో అల్లం లత మహాలక్ష్మి ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, మండల అధ్యక్షులు కేతా మీరయ్యలు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినుల సత్తా

ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలలో మహిళలు పైచేయి సాధించినట్లు మొదటి సంవత్సరం 56 శాతం, రెండవ సంవత్సరం 81 శాతం విద్యార్థులు విజయం సాధించినట్లు ప్రిన్సిపల్ నున్న శ్రీదేవి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎన్.ఎలీషా 903 ప్రథమ, ఎ.లలిత 890 ద్వితీయ, వి.మరియా 835 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి సరోజిని వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, తహశీల్దార్ జి.కనకరాజు విద్యార్థులను అభినందించారు.

ఛాంబర్స్ కళాశాల విద్యార్థుల విజయకేతనం

పాలకొల్లు : పాలకొల్లు చాంబర్స్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విభాగంలో బాలం తేజస్విని(బైపిసి) 440కి గాను 435 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్, స్టేట్ థర్డ్ ర్యాంకును సాధించింది. కె.గౌతమి(ఎంపిసి) 470 కి గాను 463 మార్కులతో టౌన్ థర్డ్ ర్యాంకును, ఆర్.యర్రంనాయుడు(ఎంఇసి) 500కి గాను 465 మార్కులు, పివిడిఎన్.అనూష (సిఇసి) 500కి గాను 423 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ విభాగంలో కె.లక్ష్మీ ప్రసన్న (ఎంపిసి) 1000కి గాను 982 మార్కులు, బూడి హారిక(బైపిసి) 1000కి గాను 979 మార్కులు, ఐ.లక్ష్మణ్ వర్షిత్(ఎంఇసి) 1000కి గాను 966 మార్కులు, నల్లా సహస్రాణి (సిఇసి) 1000కి గాను 944 మార్కులు సాధించారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.సీతారామరాజు, ట్రెజరర్ ఆర్.ప్రవీణ్ భాను సిబ్బంది అభినందించారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

లజపతిరాయ్ పేటలోని మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం ఇంటర్ ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు గాను లక్కింశెట్టి గీతా హారిక 464, ముదునూరి మనోహరి 462, ఉద్దరాజు ప్రశాంతరాజు 461, నక్కవరపు గాయత్రి 460, తామడ మహాలక్ష్మి 460 మార్కులు సాధించారని తెలిపారు. బైపిసి విభాగంలో 440 గాను వేమన ధనలక్ష్మి 433, వంకా ప్రవల్లిక 428, నెలపూడి గీతిక 427 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ విద్యార్థులను అభినందించారు.

విద్యా వికాస్, కార్తికేయ కళాశాలల విద్యార్థుల హవా

ఆకివీడు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక విద్యావికాస్, కార్తికేయ జూనియర్ కళాశాలలు రెండు ఒకదానికొకటి పోటీ పడుతూ ఫలితాలు సాధించాయి. స్థానిక కార్తికేయ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఎంపిసి గ్రూపులో పిండి శ్రీవాణి 990, బైపిసి 967, సిఇసిలో నిహారిక 912 మార్కులు సాధించారు. అదే కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థులు సిఇసి గ్రూపులో 453, బైపిసి 419, లావణ్య 462 మార్కులు సాధించి కళాశాలలో అగ్రస్థానం పొందారు. విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులలో సీనియర్ ఇంటర్ ఎంపిసి విద్యార్థులు నాతిరెడ్డి హరిచంద్రిక 975, బైపిసిలో నక్క సాయి లక్ష్మి 955, సిఇసిలో ఎండి అఫ్రీన్ అజ్మీ 908 మార్కులతో కళాశాల ప్రథమ స్థానం, ఉండురు ప్రసాద్ బాబు 958 మార్కులతో రెండవ స్థానం సాధించారు. కాగా మండలంలోని దుంపగడప గ్రామంలోని ఎకెపిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థులు 71 శాతం మార్కులతో మంచి పోటీలు ఇచ్చారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయదుందుభి

గణపవరం: జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుబి మోగించారని కాలేజీ ప్రిన్సిపల్ చిట్టి బొమ్మ శ్రీనివాస్ గౌడ శనివారం చెప్పారు. 75 శాతం విద్యార్థులు పాసైనట్లు తెలిపారు. సిఇసి చదువుతున్న బి.భవ్యశ్రీ 1000కి 894 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఎంపిసి చదువుతున్న బి.జ్యోతి వరలక్ష్మి 1000కి 840 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ఎంపిహెచ్‌డబ్ల్యు గ్రూపులో చదువుతున్న సరిపల్ల శిరీష్ 1000కి 840 మార్కులు సాధించి మూడవ స్థానం, ఫస్ట్ ఇయర్ 74 మంది విద్యార్థులకు 51 మంది పాస్ అయినట్లు చెప్పారు. వీరిలో ఎంపిసి చదువుతున్న జి.ప్రసన్న లక్ష్మీ 448/470 మార్కులు సాధించి ప్రథమస్థానం హెక్ గ్రూపులో చదుతున్న ఎ.నికిల 412 సాధించి రెండవ స్థానం సిఇసిలో జి.మాధురి 391 మార్కులు సాధించి మూడవ స్థానం సాదించినట్లు చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన రాయకుదురు హైస్కూల్ ప్లస్

వీరవాసరం : ఇంటర్మీడియట్ ఫలితాలలో రాయకుదురు హైస్కూల్ ప్లస్ విద్యార్థులు బైపిసి గ్రూపులో మొదటి సంవత్సరం విద్యార్థులు 46 శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండవ సంవత్సరం 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసి గ్రూపు మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.జోత్స్న 453, ద్వితీయ సంవత్సరం ఐ.లక్ష్మీదుర్గా 945 మార్కులు సాధించింది. బైపిసి గ్రూపులో మొదటి సంవత్సరం కె.సంతోషి 404, రెండవ సంవత్సరం వై.ప్రశాంతి 948 మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారు. వీరిని హెచ్‌ఎం కె.శ్రీనివాస్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, సర్పంచి గెడ్డం భారతీ భాస్కర్‌రావు అభినందించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

నరసాపురం: నరసాపురం జనసేన కార్యాలయంలో శనివారం మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన ఈదా ప్రభుదాసుకి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.5 లక్షల ఎల్‌ఓసిను అందజేశారు. ఈ సహాయాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అందజేశారు.

CHANGE OF NAME

I, **MALLADI NIKHITHA ARCHANA** W/o. Marubariki Satish, D.No. 10-4-22A, Mattam Street, Salipeta, Narasapuram-534 275, W.G.Dt., A.P. I have changed my name from **MARUBARIKI NIKHITHA ARCHANA** (Old name) to **MALLADI NIKHITHA ARCHANA** (New name) hence forth I am being called **MALLADI NIKHITHA ARCHANA** W/o. Marubariki Satish for all purposes

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర గ్రామానికి చెందిన తుంగా బాలకృష్ణ, తండ్రి : సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి దగ్గర నుండి పెనుమంట్ర సెంటర్ కు వచ్చేటప్పటికి నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **N8208461** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

తుంగా బాలకృష్ణ
తండ్రి : సత్యనారాయణ
డోర్ నెంబర్ : 5-52,
శివాలయం వీధి,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 77298 11789

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం
O.S. No.387 / 2020

Between:
వానపల్లి సత్య దుర్గాప్రసాద్ వగైరాలు ...వాదులు
మరియు
1) వానపల్లి శ్రీనివాసరావు
2) గనిశెట్టి అమ్మాజీ
3) పొన్నగంటి పాపాయ్యమ్మ
4) గనిశెట్టి V.V.K.N.H.కుమార్ ...ప్రతివాదులు

To: D4:: గనిశెట్టి V.V.K.N.H.కుమార్
S/o. వీరవెంకట సూర్యనారాయణ, వయస్సు 38 సం॥లు, ఉద్యోగం
ప్రస్తుత చిరునామా: డో.నెం.1-40/సి, శంకర్‌నగర్ కాలనీ, రోడ్ నెం.3, అశోక్‌నగర్, శేర్‌లింగంపల్లి, హైదరాబాద్- 502307, తెలంగాణ
శాశ్వత చిరునామా: డో.నెం.17-112, శాలిపేట, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534 281

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది ఉన్న రెండు చిరునామాలకు ఎన్నిసార్లు దావా సమను నోటీసులు పంపినను అందుకొనక Evade చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ది.**22-04-2025** సం॥రం ఉదయం గం॥**10.30** ని॥లకు మీరు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై సంజాయిషీ యివ్వనియెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమునందు తీర్మానించదమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

భమిడిపాటి వెంకటరామ శర్మ
అడ్వకేటు, కాకినాడ, సెల్: 9246589838
కె.వి.సూర్యనారాయణ
అడ్వకేటు, రాజమహేంద్రవరం
సెల్: 9441475573
కాకినాడ
ది.08-04-2025

CHANGE OF NAME

I, **TADINADA.MAHALAKSHMI** W/o. Kocherla kota. Gopal, 1st Floor, Plot No.105, Nuna Tavers, Subbaraopeta, D.S.Cheruvu, Tadepalli Gudem, W.G.Dt., A.P. I have changed my name from **TADINADA MAHA LAKSHMI** (Old name) to **TADINADA.MAHALAKSHMI** (New name) hence forth I am being called **TADINADA.MAHALAKSHMI** W/o. Kocherla kota. Gopal for all purposes

IN THE COURT OF THE CIVIL JUDGE; (SENIOR DIVISION) TADEPALLIGUDEM.
O.S.No. 10/2023

Between:
Chilla Varalakshmi ... **plaintiff**
And
Perumalla Venkata Phanidra Kumar ... **Defendant**

To,
Defendant :
1. Perumalla Venkata Phanindra Kumar S/o. Venkata Vijaya Raghava Rao, Age 45 years, Hindu, Male, Business, D.No.9-76/1, Nethalavari Veedhi,Ganapavaram mandal, West Godavari District, TPG PJCJC - 534198.

Please take notice that the above suit is filed by the plaintiff against the defendant. The matter is posted for the appearance of the above defendant on dt. 22-04-2025 from 10.30 A.M. onwards, on which day you may appear in person or through your advocate and file your objections/pleadings if any. Otherwise, the matter will be adjudicated according to law in your absence.

G.Syama Prasad Mukherjee,
N. Surya Mani,
Advocates, Tadepalligudem.
Tadepalligudem.
Date: 09-04-2025

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), నూజివీడు వారి కోర్టులో
ఓ.యస్.నెం. 63/2024

బిట్వీన్:
పోట్రు శివకుమారి ...వాది
మరియు
రాణిమేకల శ్రీమన్నారాయణ ...ప్రతివాది
టూ:- ప్రతివాది
రాణిమేకల శ్రీమన్నారాయణ,
తండ్రి: వెంకటేశు అనే వేంకటేశ్వరరావు,
వయస్సు 65 సం॥, అమ్మవారిగూడెం గ్రామం, ఆగిరిపల్లి మండలం, కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు పైన పేర్కొనిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా **ది.09-05-2025వ సం॥రం తేదీన** వున్నది. సదరు **తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షము నందు తీర్మానించుదురు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా)

మన్నం రమేష్
అడ్వకేట్, నూజివీడు
నూజివీడు
తేది:12-04-2025

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.ఎస్.నెం. 436/2024

బిట్వీన్:
బండి దుర్గా ప్రసాద్ ...వాది
అండ్
1) బండి సత్యనారాయణ
2) బండి రవి ధనకుమార్
3) జద్దు నాగ శ్వేతా షాలిని
4) బండి వెంకట మణికంఠ ...ప్రతివాదులు

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

3వ ప్రతివాది అడ్రస్సు : జద్దు నాగ శ్వేతా షాలిని, భర్త: జయ జయ రామ భూషణం, వయస్సు: 36 సం.లు, కె/ఆఫ్: జద్దు త్రిమూర్తులు, గుంపర్రు మెయిన్ రోడ్, గుంపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది హాజరునకు వాది కోర్టు ద్వారా దావా సమన్లు ఎన్నిసార్లు కట్టినసూ 3వ ప్రతివాది పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు సదరు 3వ ప్రతివాదికి పై దావాలో హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చినందున పై నెంబరు దావాలోని 3వ ప్రతివాదికి ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా మీ హాజరు నిమిత్తం **ది.12-05-2025వ సం॥రం తేదినకు** వాయిదా వేయబడినది. సదరు దావా **ది.12-05-2025వ సం॥రం తేది ఉదయం గం. 10-30 ని॥ల నుండి** పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగా యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు 3వ ప్రతివాది హాజరు కాని యెడల మీ పరోక్షమందు యీ దావా తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యు.బి. వెంకన్న, ఎమ్.ఎ., బి.యల్,
అడ్వకేట్, రాయలం, భీమవరం
భీమవరం
తేది:11-04-2025
సెల్: 90324 85408